## క్లుప్తంగా

### గ్రామ దేవతకు పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**బేతంచెర్ల:** స్థానిక బనగానపల్లె మార్గంలోని పుట్ట పెద్దమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, నైవేద్య సమర్పణ చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. అలాగే అమ్మవారి శాలలోని వాసవీ మాతకు ఆర్యవైశ్యులు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్ నగర్‌లోని సుంకులా పరమేశ్వరిదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

### భక్తిశ్రద్ధలతో హోమ పూజలు



పూజలు చేస్తున్న వేదపండితులు

**కొలిమిగుండ్ల:** కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయంలో దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్టలో భాగంగా రెండో రోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. వేదపండితులు కాణిపాకం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రాత:పూజ, మహాస్థపనం, దక్షిణామూర్తి, సుబ్రమణ్య, సుదర్శన హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఇటిక్యాల బాలిరెడ్డి కుటుంబ సభ్యులు హోమంలో పాల్గొని పూజలు చేశారు. బుధవారం మహాగణపతి, దక్షిణామూర్తి, నవ నాగేంద్ర విగ్రహాల ప్రతిష్ట చేయనున్నారు.

### మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

**కొలిమిగుండ్ల:** మండలంలోని మీర్జాపురానికి చెందిన పుల్లయ్య(65) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మృతి విషయం తెలుసుకున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి కొలిమిగుండ్లలోని మృతుని నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారి వెంట నాయకులు పేరం సత్యనారాయణ రెడ్డి, రామసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

### గ్యాస్ వినియోగంపై అవగాహన



ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ

**డోన్ టౌన్:** గ్యాస్ ప్రమాదాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, భారత్ గ్యాస్ సేల్స్ ఆఫీసర్ సురేష్ అన్నారు. మంగళవారం గ్యాస్ వినియోగంపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్యాస్ అవసరం లేనప్పుడు రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ స్టావ్ ఎత్తుకన్నా తక్కువ ఎత్తులో ఉంచుకోవాలని తెలిపారు. గ్యాస్ పరికరాలు నాణ్యమైనవి, ఐఎస్ఐ మార్కు ఉన్న వాటినే ఉపయోగించాలన్నారు. డిస్ట్రిబ్యూటర్లు రాజా విజయ్‌కుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

### చలో కర్నూలును జయప్రదం చేద్దాం



కరపత్రాలు విడుదల చేస్తున్న మాలమహానాడు నాయకులు

**డోన్ టౌన్:** కర్నూలులో ఈ నెల 23న తలపెట్టిన మాలల యుద్ధగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ కురిమెట్ల నారాయణ, మండల అధ్యక్షుడు సట్టి రాజశేఖర్ కోరారు. ఎర్రగుంట్ల గ్రామంలో మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు. మాలలు తమ హక్కుల సాధన కోసం పోరాటం చేయాలన్నారు. నాయకులు నాగేంద్ర, రంగస్వామి, వెంకటరాముడు, పెద్ద వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

### జాబ్‌మేళాలో 12 మంది ఎంపిక

**డోన్ టౌన్:** ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 12 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. టాటా క్యాపిటల్, పేటీఎం క్రెడిట్, యాక్సిస్ గ్రామీణ్ ప్రతినిధులు మొ త్తం 22 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 12 మందిని ఎంపిక చేశారని వెల్లడించారు. ప్రతి నెలా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని.. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# అగ్గి రాజుకుంటే బూడిదే

- సకాలంలో చేరుకోలేని అగ్నిమాపక యంత్రం
- ప్యాపిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ఎప్పుడో..?



పెద్దపొదిళ్లలో అగ్నిప్రమాదంలో కాలిపోతున్న గడ్డివాములు (ఫైల్)

**డోన్:** అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించాల్సింది అగ్నిమాపక కేంద్రం. సుదూర గ్రామాలను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రాల్లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే సిబ్బంది సకాలంలో స్పందించేందుకు అవకాశం ఉంటుంది. ప్యాపిలి మండలంలో 54 గ్రామాలు ఉన్నాయి. గ్రామాల్లో రైతాంగం పండించిన పంటకు సంబంధించిన దిగుబడితో పాటు పశువుల మేతను కూడా కళ్లెం దొడ్డిలో వాముగా వేస్తారు. ప్రమాదవశాత్తు చిన్నపాటి నిప్పురవ్వ ఎగిసిపడినా ఉవ్వెత్తున మంటలు చెలరేగి గడ్డివాములు, పశువుల పాకలు, గుడిసెలు దగ్ధం అవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వేసవిలో అయితే ఎంత అప్రమత్తంగా ఉన్నా ఎక్కడో ఒక చోట అగ్నిప్రమాదం సంభవిస్తూనే ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడు స్థానికులు స్పందించి బిందెలు, బక్కెట్ల ద్వారా నీటితో మంటలు అర్పే ప్రయత్నం చేసినప్పటికీ మంటలు అదుపులోకిరావు. డోన్ నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ జరగాల్సిన నష్టం జరుగుతోంది. దీంతో వేసవి వచ్చిందంటే రైతులు ఒకింత ఆందోళనకు గురి కావాల్సిన పరిస్థితి నెలకొంది.

**కలగా మారిన ఫైర్ స్టేషన్ ఏర్పాటు**

ప్యాపిలి మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చే యాలని కొన్ని దశాబ్దాలుగా ప్రజలు డిమాండ్ చేస్తు న్నారు. అయినప్పటికీ పాలకులు, అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించడం లేదు. స్థానికంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించే అవకాశం ఉంటుంది. అగ్నిప్రమాదాలు, షార్ట్‌సర్క్యూట్ కారణంగా తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రెండు, మూడు ప్రమాదాలు ఒకేసారి జరిగినప్పుడు డోన్ అగ్నిమాపక సిబ్బంది కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఉంటుంది. పాలకులు, అధికారులు స్పందించి ప్యాపిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



ప్యాపిలిలో కాలిపోయిన చెట్లు (ఫైల్)

**అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి**



గ్రామాల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే మంటలు ఆర్పాలంటే అగ్నిమాపక కేంద్రం అన్ని గ్రామాలకు అందుబాటులో ఉండాలి. ప్యాపిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ ఇంజన్ వచ్చే అవకాశం ఉంటుంది. కావున అధికారులు ప్రతిపాదనలు పంపి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి. –రామకృష్ణ, జక్కసానికుంట్ల

**రైతులు నష్టపోతున్నారు**



రైతులు తమ కళ్లం దొడ్లలో వేసుకున్న గడ్డివాములు అగ్నిప్రమాదంలో కాలిపోతే తీవ్రంగా నష్టపోతున్నారు. డోన్‌లో ఉన్న ఫైర్‌ఇంజిన్ వచ్చేలోపు గడ్డివాములు, గుడిసెలు కాలి బూడిదవుతున్నాయి. ప్యాపిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందిస్తే బాగుంటుంది. –బాబయ్య, ఎస్‌రంగాపురం

## ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సుధాకర్

**కోవెలకుంట్ల:** కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిషాన్‌తో పాటు వివిధ వ్యవసాయ పథకాల వర్తింపునకు అర్హత సాధించాలంటే ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని వ్యవసాయ సహాయ సంచాలకుడు సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని సొదరదిన్నెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కోవెలకుంట్ల మండలంలో 13 వేల పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు ఉండగా ఇప్పటి వరకు కేవలం 3 వేల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ప్రాముఖ్యతను తెలుసుకుని రైతులు వారి ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకుని త్వరితగతిన రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రతి రైతుకు ఒక గుర్తింపు నంబర్ కేటాయిస్తామని తెలిపారు. మండల వ్యవసాయాధికారి నిరంజన్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 25 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

**కొలిమిగుండ్ల:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 25, 26 తేదీల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేస్తామన్నారు. కబడ్డీతో గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గో బహుమతి రూ.8వేలు అందిస్తామని వెల్లడించారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్ విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9441668450, 9440163032 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకారం



సర్పంచ్ సరళను సత్కరిస్తున్న అధికారులు, పాలకవర్గ సభ్యులు

**కోవెలకుంట్ల:** స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి పంచాయతీ పాలక వర్గం పూర్తి సహకారం అందిస్తుందని సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో గత నెలలో పాలకవర్గం ఆమోదించిన వివిధ పనుల పురోగతి, ఈ నెలలో చేపట్టాల్సిన పనుల తీర్మానంపై పంచాయతీ అధికారులు, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఆయా కాలనీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను చదివి వినిపించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములైనప్పుడే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పారిశుద్ధ్యం, ఇంటి, నీటి పన్నుల వసూలు, వర్మికంపోస్టు తయారీ, విక్రయాలు, గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చే వనరుల నిర్వహణ, తదితర అభివృద్ధి పనులను పరిగణలోకి తీసుకుని కోవెలకుంట్లను ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక చేశారన్నారు. జనవరి 26వ తేదీ ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్న సర్పంచ్ మెట్ల సరళను ఈ సందర్భంగా వార్డుసభ్యులు, పంచాయతీ అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ ప్రకాష్‌నాయుడు, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణ పనుల అడ్డగింత



అక్రమ నిర్మాణాలను పోలీసులకు చూపిస్తున్న కాలనీవాసులు

**అవుకు:** మండల కేంద్రంలోని గుర్రాలపేటలో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న ఇంటి నిర్మాణ పనులను కాలనీవాసులు మంగళవారం అడ్డుకున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. అవుకు పట్టణానికి చెందిన గురువయ్య గుర్రాలపేటలోని ఓ పాత ఇంటిని కొనుగోలు చేశాడన్నారు. ఆ ఇంటిని కూల్చివేసి కొత్త ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడని.. అయితే ఇంటి పక్కనే ఉన్న రోడ్డును సైతం ఆక్రమించి నిర్మాణ పనులు చేస్తున్నారని వాపోయారు. ఇంటిని ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాన్ని సైతం తొలగించేందుకు ప్రయత్నాలు చేశాడని తెలిపారు. సందు రస్తాలోనే బాత్‌రూమ్ గుంతలు తీశారని.. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. అక్రమ నిర్మాణాల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఉంటాయన్నారు. అధికారులు రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## యాగంటిలో బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

**బనగానపల్లె రూరల్:** యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం బ్రహ్మోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల నిర్వహణలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, మంచినీటి సౌకర్యం, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. 25, 26, 27వ తేదీల్లో వాహనాలకు టోల్ వసూలు చేయవద్దని ఆదేశించారు. తన సొంత ఖర్చుతో భక్తులకు ఉచితంగా లడ్డూలను పంపిణీ చేస్తామన్నారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌలీశ్వరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విలేకర్లపై దాడి హేయమైన చర్య



సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న విలేకరులు

**బనగానపల్లె:** పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ మద్దయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు జి.సర్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. విలేకరిపై దాడి చేసిన టీడీపీ మండల అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాల్ నాయుడుపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల కాలంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, రఘురామిరెడ్డి, చెన్నయ్య, చంద్రశేఖర్, రఘురామిరెడ్డి, సుధాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు కృషి

- డోన్ డిప్యూటీ డీఈఓ

**కోవెలకుంట్ల:** 2024-25 విద్యా సంవత్సరంలో డోన్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కోవెలకుంట్ల ఎంఈఓగా పనిచేస్తున్న తనకు జిల్లా ఉన్నతాధికారులు డిప్యూటీ డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆయా పాఠశాలల్లో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో వెనుకబడిన విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

## కార్మికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు

**బేతంచెర్ల:** సిమెంట్‌నగర్ గ్రామంలోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికులకు ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 3 నెలలుగా ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిచిపోయిందని, కార్మికులు అయోమయంలో ఉన్నారని తన దృష్టికి రావడంతో ఫ్యాక్టరీ యజమాన్యంతో చర్చించినట్లు తెలిపారు. ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభించాలని.. లేకపోతే వేరే యజమాన్యానికి అప్పగించాలని కోరగా సమయం అడిగారన్నారు. ఉత్పత్తి ప్రారంభం కాగానే స్థానికులకు ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



ప్యాడ్లు, పెన్నులు అందుకున్న విద్యార్థులు

**డోన్ టౌన్:** సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వివేకానంద సేవా సమితి సభ్యులు విజ్ఞప్తి చేశారు. కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ నవీన్‌కుమార్ ఆర్థిక సహకారంతో మంగళవారం ఎస్సీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు పరీక్షల ప్యాడ్స్, పెన్నుల కిట్లను అందజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌మోహన్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, శ్రీనివాసులు, కోశాధికారి రంగయ్య, సభ్యులు తొగట సురేష్‌బాబు, అనీల్ కుమార్ పాల్గొన్నారు.

## జోరుగా రైతుల నమోదు ప్రక్రియ



వివరాలు నమోదు చేయించుకుంటున్న రైతులు

**బేతంచెర్ల:** మండలంలోని ఆయా గ్రామాల్లో వారం రోజుల వ్యవధిలో 3400 మంది రైతులకు విశిష్ట సంఖ్య కేటాయించినట్లు ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఎంబాయి గ్రామంలో జరుగుతున్న విశిష్ట సంఖ్య నమోదును ఆయన పరిశీలించారు. మండలంలో మొత్తం 12వేల మంది రైతులు ఉన్నారని, ఈనెల చివరి వరకు నమోదుకు అవకాశం ఉందన్నారు. రైతులు త్వరితగతిన రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

## బుద్ధి మాంద్యం పిల్లలకు ఇంటి వద్దే పరీక్షలు

**బనగానపల్లె రూరల్:** జిల్లా న్యాయసేవా సంస్థ ఆదేశాల మేరకు పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుద్ధిమాంద్యం పిల్లలకు ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేశారు. మంగళవారం మెడికల్ ఆఫీసర్ మధుమోనిక, న్యాయసేవా సంస్థ సభ్యులు అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ టెస్టులు చేసి పలు సూచనలు చేశారు. అలాగే ప్రభుత్వం నుంచి రూ.15 వేల పింఛన్ వస్తుందా లేదా తదితర వివరాలను తెలుసుకున్నారు. పింఛన్ రావడానికి టెక్నికల్ సమస్యలు వివరించి నంద్యాల ప్రభుత్వ వైద్యశాల మెడికల్ బోర్డు వైద్యులను సంప్రదించి వైద్య సహాయం పొందడానికి పలు సూచనలు ఇచ్చారు.

## సమన్వయంతో ప్రభుత్వ బడుల బలోపేతం





బేతంచెర్ల: శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, శిక్షణ ఇస్తున్న సీడీపీఓ, రిసోర్స్ పర్సన్స్

**బేతంచెర్ల:** అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్‌లో మండలంలోని 74 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి 120పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓలు సోమశేఖర్, అబ్రహం, డీఆర్‌పీలు నాయక్, నాగరాజు, సోమన్న, రేణుక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

- **బనగానపల్లె రూరల్:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతిపై మంగళవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కోర్స్ డైరెక్టర్లు ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల జ్ఞానజ్యోతిపై ఆరు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన, ప్రీస్కూల్ నిర్వహణపై రిసోర్స్ పర్సన్స్ సత్యప్రకాష్, మద్దిలేటి, మధుకిశోర్, సాలమ్మ, శైలజ, చిట్టెమ్మ శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, స్కూల్ హెచ్ఎ రామకృష్ణ సీఆర్‌పీలు మధు, చంద్రుడు, శివప్రసాద్, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ

- **కొలిమిగుండ్ల:** స్థానిక ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం ఫౌండేషన్ లెవల్ ట్రైనింగ్‌ను ప్రారంభించారు. ఈనెల 25వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని ఎంఈఓ అబ్దుల్ కలాం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తప్పక శిక్షణకు హాజరుకావాలని సూచించారు. ఆర్పీలు, కో-ఆర్డినేటర్లు ఇచ్చే సలహాలు, సూచనలు తెలుసుకుని సెంటర్లలో చిన్నారులకు మంచి విద్య అందించాలన్నారు. 2026 నాటికి కేంద్రాల్లోని చిన్నారులు అందరూ అక్షరాలు గుర్తించేలా ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హెచ్ఎం హుసేనయ్య, రిసోర్స్ పర్సన్ చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాలనీలకు నీటి సదుపాయం



నీటి సరఫరా కోసం బోరు నుంచి ఏర్పాటు చేసిన రింగ్ పైపులైన్

**కొలిమిగుండ్ల:** స్థానిక పోస్టాఫీసు సమీపంలోని కాలనీలకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సదుపాయం కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపం నుంచి పోస్టాఫీసు వరకు ఉపాధి హామీ నిధులతో డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. నిర్మాణ పనుల కోసం పైపులైన్‌ను తొలగించారు. దీంతో కాలనీలకు నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఈనెల 14న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'రోడ్డు నిర్మాణంతో కాలనీల్లో నీటి సమస్య' అనే శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో గ్రామ పంచాయితీ స్పందించింది. మంగళవారం రామసుబ్బారెడ్డి ఆస్పత్రి ఎదురుగా ఉన్న బోరు నుంచి మూడు ఇంచుల రింగు పైప్‌ను సమీపంలోని పైపులైన్‌కు అనుసంధానం చేశారు. నాలుగు కాలనీలకు నీటి సరఫరా జరగడంతో 20 రోజుల తాగునీటి కష్టాలకు పుల్‌స్టాప్ పడింది. దీనిపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్

## మేలుజాతి దూడల ప్రదర్శన



లేగ దూడలను పరిశీలిస్తున్న అధికారులు



పాడి రైతులకు మందులు పంపిణీ

**డోన్ టౌన్:** మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామంలో గోకుల్ మిషన్ పథకం కింద మంగళవారం మేలుజాతి దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గోవింద్‌నాయక్, ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహణాధికారి రాజశేఖర్, డోన్ ఏడీ నాగరాజు హాజరయ్యారు. ఒంగోలు సహా మేలు రకాలకు చెందిన దూడల పోషణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. నట్టల నివారణ మందులు అందజేశారు. అనంతరం రైతులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, పశువైద్యశాల సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం చెల్లించకుండా కూల్చేశారయ్యా!



సమస్యను ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న బాధితులు

**బేతంచెర్ల:** మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించకుండా, సమయం ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చివేస్తున్నారని బాధితులు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డికి మంగళవారం విన్నవించారు. డోన్ నుంచి బేతంచెర్ల మండలానికి వస్తున్న ఎమ్మెల్యేను రంగాపురం గ్రామంలో అడ్డుకొని తమ గోడు వెల్లబోసుకున్నారు. సర్వే చేయించి నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, జాతీయ రహదారి నిర్మాణ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

## విశిష్ట గుర్తింపు సంఖ్యతోనే సంక్షేమ ఫలాలు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ

**బనగానపల్లె:** వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతు వివరాలు నమోదు చేసుకుని విశిష్ట సంఖ్య పొందాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాతపాడు, మీరాపురం గ్రామాల్లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. విశిష్ట సంఖ్య ఆధారంగానే సంక్షేమ పథకాలు, రాయితీలు, రుణాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.